క్లుప్తంగా

మట్టి వినాయక ప్రతిమలే వినియోగించాలి



మట్టి వినాయక ప్రతిమలతో విద్యార్థినులు

భీమునిపట్నం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ వినాయక చవితి సందర్భంగా మట్టి ప్రతిమలను మాత్రమే వినియోగించాలని స్థానిక కస్తూర్బా గాంధీ విద్యాలయం ప్రిన్సిపాల్ కుమారి మహాలక్ష్మి సూచించారు. విద్యాలయం వద్ద విశాఖ గ్రీన్ క్లైమేట్ టీం సహకారంతో విద్యార్థినులు మట్టి వినాయక ప్రతిమలను ఆదివారం తయారు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రసాయనాలతో తయారు చేసిన ప్రతిమల వల్ల పర్యావరణానికి ఎంతో ముప్పు ఏర్పడుతుందన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ మట్టి ప్రతిమలనే వినియోగించాలని, ఇక్కడి విద్యార్థినులు తయారుచేసిన వాటిని అందరికీ అందజేస్తామని తెలిపారు. టీం ప్రతినిధులు రాజేశ్వరి, రవితేజ పాల్గొన్నారు.

75 మంది రక్తదానం



రక్తదానం చేస్తున్న యువకులు

ఆనందపురం : మండలంలోని మామిడిలోవలో విశాఖ జోన్ శ్రీసత్య సాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన శిబిరంలో 75 మంది రక్తదానం చేశారు. ఏఎస్ రాజా వలంటీర్ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది యువకులు, మహిళల నుంచి రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా మామిడిలోవ గ్రామం సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధి బలిరెడ్డి పెంటయ్య మాట్లాడుతూ అత్యవసర సమయంలో రక్తం అందక చాలా మంది మరణిస్తున్నారని, అలాంటి వారిని ఆదుకోవడానికి రక్తదాన శిబిరాలు నిర్వహించి అందిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల జోనల్ కో - ఆర్డినేటర్ ఎంపీ సత్యసాయి కుమార్, మెడికల్ కో - ఆర్డినేటర్ సాయి కుమార్, వేణుగోపాల్, బి.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

పద్మనాభం: మండలంలోని మద్ది గ్రామంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా ఈ నెల 6న నిలిపిన శ్రీకృష్ణుడు విగ్రహం వద్ద శనివారం రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల కోలాటం, సత్సంగం ఆకట్టుకున్నాయి. ఈ నెల 16న శ్రీకృష్ణుడి విగ్రహాన్ని మద్దిలో ఊరేగిస్తారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సమితి, ఇందూ జ్ఞాన వేదిక విజయరాంపురం కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయి.

అలరించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శన



శిల్పారామంలో శాస్త్రీయ నృత్య ప్రదర్శనలో కళాకారులు

మీఎం పాలెం: వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం 6 గంటలకు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శన ఆద్యంతం ప్రేక్షకులను అలరించింది. నగరానికి చెందిన వారాహి కూచిపూడి నృత్య అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రదర్శన ప్రణవలయ పాహి బృంద నృత్యాంశంతో ప్రారంభమైంది. కళాకారులు తమ నృత్యాభినయంతో ప్రేక్షకుల మన్ననలు అందుకున్నారు. కళాకారులు మనోజ్ఞ, రమ్యశ్రీ, విధిత, హైమశ్రీ, సాయిదీక్షిత, జ్యోత్స్న, గీతాన్సీ, శృతి పాల్గొనగా ఎస్.పరమేశ్వరి నృత్య దర్శకత్వం వహించారు.

పరిశ్రమల రోడ్డుతో పంటలకు నష్టం

- మామిడిలోవలో 40 ఎకరాల్లో నిలిచిన వర్షపు నీరు
- రైతుల ఫిర్యాదుతో విచారణకు జేసీ ఆదేశం



మామిడిలోవలో చెరువును తలపిస్తున్న పంట పొలాలు

ఆనందపురం : రెండు పరిశ్రమల వల్ల 40 ఎకరాల్లో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. వాటి యజమానులు పంట పొలాలను కొనుగోలు చేసి.. అక్కడ చక్కగా పరిశ్రమలను ఏర్పాటు చేశారు. స్థానికులకు ఉపాధి కల్పించారో లేదో తెలియదు కానీ తమ పొలాల్లో పంటలు మాత్రం నాశనం చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. తీవ్రంగా నష్టపోయిన రైతులు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్‌కు ఇటీవల ఫిర్యాదు చేయగా ఆయన విచారణకు ఆదేశించారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మామిడిలోవ గ్రామంలో సుమారు 20 ఎకరాల జిరాయతీ భూమిని ఇద్దరు పారిశ్రామికవేత్తలు కొనుగోలు చేశారు. వాటి చుట్టూ వరి, ఇతర పంటలు పండించే పొలాలు ఉన్నాయి. కాగా కొనుగోలు చేసిన పంట పొలాలను సుమారు పది అడుగులు ఎత్తున కప్పివేశారు. అక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేసి జాతీయ రహదారి నుంచి అక్కడకు చేరుకోవడానికి అంతే ఎత్తున రోడ్డుని నిర్మించారు. దీంతో వాటి చుట్టు పక్కల ఉన్న పంట పొలాలు లోతట్టుగా మారాయి. సత్తరువు, కణమాం గ్రామాల కొండల నుంచి వచ్చే వరద నీరు పంట పొలాల గుండా ప్రవహించి కణమాం, శొంఠ్యాం చెరువులకు చేరుతుంది. కాగా పరిశ్రమల యజమానులు పొలాలకు అడ్డంగా రోడ్డు నిర్మించడంలో పైనుంచి కిందకి వరద నీరు ప్రవహించని పరిస్థితి నెలకొంది. దీంతో వరద నీరు నిలిచిపోవడంతో సుమారు 20 ఎకరాల్లో వరి పంట, మరో 20 ఎకరాల్లో గల ఇతర పంటలు నీట మునిగాయి. రోజుల తరబడి నీరు అలాగే నిలిచి ఉండిపోవడంతో పంటలు ఎందుకూ పనికి రాకుండా పోయాయి. ఈ విషయమై పరిశ్రమల యజమానులకు తెలిపినా ఏమాత్రం స్పందించకపోవడంతో రైతులు జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ప్రతి ఏడాది ఇదే సమస్యను ఎదుర్కొంటున్నామని, ఇప్పటికైనా అధికారులు విచారణ జరిపి న్యాయం చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.

'కళా సాహితి'తో కళలకు ప్రోత్సాహం



కొత్తగా ఏర్పాటైన కళా సాహితి కార్యవర్గ సభ్యులు

భీమునిపట్నం: భీమిలిలో ఏర్పాటు చేసిన కళా సాహితి సంస్థ ద్వారా ఈ ప్రాంతంలో సంప్రదాయ పాటలు, నృత్యాలు, సాహిత్యం, చిత్రలేఖనం వంటి కళలను ప్రోత్సహించనున్నామని ఆ సంస్థ అధ్యక్షులు పాత్తూరి రాజేంద్రప్రసాద్ వర్మ పేర్కొన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో పూర్తిగా పాశ్చత్య ప్రభావం వల్ల మన కళలు, సంప్రదాయాలు పూర్తిగా అందరూ మర్చిపోయే స్థితికి వచ్చేశారన్నారు. ఇప్పటితరం పిల్లలు, యువతకు వీటి గురించి తెలియకపోవడం చాలా దురదృష్టకరమన్నారు. అందుకే ఈ సంస్థ ద్వారా ప్రచారం చేయడం, ప్రోత్సహించడంతోపాటు పేద కళాకారులను ఆదరించి ఆదుకుంటామని తెలిపారు. అందులో భాగంగా ప్రతీ నెల పలు కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు విద్యార్థులను భాగస్వాములుగా చేసి పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమాల నిర్వహణకు పలువురు పెద్దలు ముందుకొచ్చారని, వారి సహకారంతో అన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా కొత్త కార్యవర్గం ఏర్పాటైంది. గౌరవ అధ్యక్షులుగా రేలంగి పెదబాబు, అధ్యక్షులుగా పాత్తూరు రాజేంద్రప్రసాద్ వర్మ, కార్యదర్శిగా అడిదం సన్యాసిరాజు, కోశాధికారిగా కాళ్ల సన్నీ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ముసునూరి సూర్య శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

వివేకానంద రీడింగ్ రూమ్ ప్రారంభం



రీడింగ్ రూమ్ ప్రారంభిస్తున్న మేజిస్ట్రేట్ విజయలక్ష్మి

భీమునిపట్నం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో యువ భారత్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వివేకానంద ఉచిత రీడింగ్ రూమ్ ఆదివారం ప్రారంభమైంది. దీన్ని ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మేజిస్ట్రేట్ జి.విజయలక్ష్మి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించే పుస్తకాలు ఈ కేంద్రంలో ఉన్నాయని తెలిపారు. ఇది వారికి ఎంతో ఉపయోగపడుతుందని, చదువుకు ప్రోత్సాహకరంగా ఉంటుందన్నారు. విద్యార్థుల కోసం రీడింగ్ రూమ్ ఏర్పాటు చేసిన యువభారత్ నిర్వాహకులు అభినందనీయులని కొనియాడారు. ఎంఈవో శివరాణి మాట్లాడుతూ విద్యార్థులకు ఇటువంటి చక్కని అవకాశం రావడం ఎంతో అదృష్టమన్నారు. యువ భారత్ వ్యవస్థాపకులు ఎల్లాజీరావు, సభ్యులు సత్యనారాయణ, కనకేశ్వరరావు, పైడినాయుడు, వెంకటరమణ, సన్యాసినాయుడు పాల్గొన్నారు.

ముగిసిన హిందీ పరీక్షలు



భీమిలి నెహ్రూ జీవీఎంసీ హైస్కూల్‌లో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

తగరపువలస: దక్షిణ భారత హిందీ ప్రచార సభ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు జరిగిన హయ్యర్, లోయర్ పరీక్షలు ఆదివారంతో ముగిశాయి. ఈ రెండు రోజుల్లో 150 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్టు నెహ్రూ జీవీఎంసీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు తిరుమల శ్రీదేవి తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్టు భీమిలి ఆదర్శ హిందీ ప్రేమీ మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు తెలిపారు.

ఇళ్ల అద్దెలకు రెక్కలు

తగరపువలస, భీమిలిలో భారీ డిమాండ్



తగరపువలస: జీవీఎంసీ భీమిలి అర్బన్, రూరల్ పరిధిలో అద్దె ఇళ్లకు డిమాండ్ పెరిగింది. నిత్యం అద్దె ఇళ్ల కోసం వీధుల్లో తిరుగుతూ విచారించేవారు అధికమయ్యారు. ఎక్కడైనా ఒక ఇల్లు ఖాళీ అయితే అద్దె ధరలు ఎంతయినా లెక్క చేయకుండా వెంటనే అడ్వాన్స్ చెల్లించి రిజర్వ్ చేసుకుంటున్నారు. తగరపువలస కేంద్రంగా నిత్యం జనాభా పెరుగుతుండడంతోపాటు దివీస్ లేబొరేటరీలో 10 వేల మంది వరకు కార్మికులు, ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఇవే కాకుండా షై వుడ్ పరిశ్రమలు, భోగాపురం ఎయిర్ పోర్ట్ తదితర ప్రాంతాల్లో వివిధ కాంట్రాక్ట్ పనుల మీద, భవన నిర్మాణ పనులకు విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి వేల సంఖ్యలో జనం వస్తున్నారు. అంతేకాకుండా చుట్టుపక్కల ప్రాంతాల్లో డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, ఫార్మసీ, నర్సింగ్, పాలిటెక్నిక్ విద్యా సంస్థల్లో చదువుకునే వారు ప్రభుత్వ, ప్రైవేట్ వసతి గృహాలను కాదనుకుని సొంతంగా అద్దె ఇళ్లలో ఉండటానికి మక్కువ చూపుతున్నారు. భీమిలి జోన్ పరిధిలో చిన్నా చితకా 12వేల వరకు ఇళ్లు, వందల సంఖ్యలో అపార్ట్ మెంట్లు, పదుల సంఖ్యలో కాలనీలు నిండిపోవడంతో తగరపువలసను ఆనుకుని మండల ప్రాంతాల్లో ఇళ్లను అద్దెకు వెతుక్కుంటున్నారు. నలుగురు కుటుంబ సభ్యులు ఉండే సింగిల్ బెడ్‌రూమ్ గతంలో రూ.3500 అద్దెకు దొరికేవి. డబుల్ బెడ్‌రూమ్‌లు రూ.5,500 అద్దెకు లభించేవి. ఇప్పుడు వీటి అద్దెలు వరుసగా రూ.5,500, రూ.8 వేలకు చేరుకున్నాయి. ఇక అన్ని సదుపాయాలు ఉండే అపార్ట్‌మెంట్లు, గ్రూప్ హౌస్‌ల అద్దెలు రూ.12వేల నుంచి రూ.25వేల వరకు ఉంటున్నాయి. కమర్షియల్ అవసరాల నిమిత్తం ఇంకా ఎక్కువ అద్దెలు, రూ.లక్షలలో అడ్వాన్స్‌లు వస్తుండటంతో యజమానులు చెప్పినరేటుకు అద్దెకు దిగుతున్నారు.

ఎక్కడ చూసినా హౌస్ ఫుల్..

ప్రస్తుతం తగరపువలస చుట్టుపక్కల ప్రాంతాల్లో రేకుల షెడ్లకైనా డిమాండ్ ఎక్కువగా ఉంది. సాధ్యమైనంత వరకు దీనిని సొమ్ము చేసుకోవడానికి ఇళ్ల యజమానులు మొగ్గు చూపుతున్నారు. ఇళ్లను పెంచి అదనపు గదులు నిర్మించి అద్దెలకు ఇస్తున్నారు. ఈ కారణంగా తగరపువలస, చిట్టివలస, సంగివలస డివిజన్‌లో పార్కింగ్ సమస్య ఎక్కువగా ఏర్పడింది. తగరపువలస, చిట్టివలస మార్కెట్ ఏరియాలో వీధులు, సందులు అన్నీ వాహనాల పార్కింగ్‌కే సరిపోతున్నాయి. దీంతో నడచి వెళ్లేవారు ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర వాహనాలైన అంబులెన్స్, అగ్నిమాపక శకటం, చెత్త తరలించే వాహనాలు, రేషన్ సరఫరా చేసే వాహనాలు వీధుల్లో తిరగడానికి నిత్యం అంతరాయం కలుగుతోంది. అయిదేళ్ల క్రితం భీమిలిలో చాలా వరకు ఇళ్లు ఖాళీగా ఉండటమే కాకుండా అద్దెలు తక్కువగా ఉండేవని, ఇప్పుడు వలస వచ్చేవారి సంఖ్య పెరిగినా ఇళ్ల నిర్మాణం పెరగకపోవడంతో అద్దెలు పెరిగిపోయాయని పలువురు అంటున్నారు. సొంత ఇల్లు లేని వారి పరిస్థితి దుర్భరంగా ఉందని, సంపాదనలో 40 శాతం వరకు అద్దెలకే వెచ్చించాల్సి వస్తోందని వాపోతున్నారు.

ఎర్నిమాంబకు ఏకాదశి పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు

కంచరపాలెం: జ్ఞానాపురం పరిధి కాన్వెంట్ కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం శ్రావణ మాస శుద్ధ ఏకాదశి ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలకంరించారు. ఆలయ ప్రధాన అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ పరిసరాల్లో వంటా వార్పు చేసుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ సిబ్బంది రామకృష్ణ, ప్రసాద్, జోజిబాబు పాల్గొన్నారు.

గణపతి నవరాత్రులకు పందిరి రాట



సంగివలసలో ఉత్సవరాట వేస్తున్న యువత



ముహూర్తపు రాట వేస్తున్న భక్తులు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు సంగివలసలో నిర్వహించనున్న గణపతి నవరాత్రుల ఉత్సవాలకు ఆదివారం శ్రీకృష్ణ యాదవ సంఘం యువకులు ఉత్సవ రాట వేశారు. పెద్ద ఎత్తున ఉత్సవాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు నమ్మి లక్ష్మణరావు, అక్కరమాని గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం: భీమిలి కళ్లవీధికి చెందిన వారు ఆదివారం గణపతి ఉత్సవాల నిర్వహణకు ప్రత్యేక పూజలు చేసి ముహూర్తపు రాట వేశారు. గ్రామ పెద్దలు ఆర్.ప్రభాకర్‌నాయుడు, కంటుభుక్త ముత్యాలరావు, సంకరుభుక్త జోగారావు, మొకర పైడి సూర్యనారాయణ, సంకురుభుక్త రవి, ఉత్సవ కమిటీ సభ్యులు ఆర్.హర్షిత, హర్షవర్ధన్, సాయి, సురేష్, శ్రీను పాల్గొన్నారు.



కోన వారి కళ్లాల్లో పందిరి రాట వేస్తున్న భక్తులు

పద్మనాభం: మండలంలోని రేవిడి పంచాయతీ రౌతులపాలెం కోనవారి కళ్లాల్లో ఆదివారం వినాయక పందిరి రాట ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా పూజలు నిర్వహించారు. అనంతరం పందిరి రాట వేశారు. బంగారమ్మ తల్లి యూత్ సభ్యులు పాల్గొన్నారు.

సెల్ టవర్ నిర్మాణ పనులు అడ్డగింత



సెల్ టవర్ వద్ద నిరసన తెలుపుతున్న కాలనీవాసులు

మధురవాడ: సెల్ టవర్ నిర్మాణంతో ప్రశాంత జీవనానికి భంగం కలుగుతుందని, పనులు తక్షణమే నిలుపుదల చేయాలని మిథిలాపురి ఏపీహెచ్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రొఫెసర్ బాబివర్ధన్ అన్నారు. ఆర్‌టీసీ కాలనీ సమీపంలో ఓ ప్రముఖ సెల్ సంస్థ చేపడుతున్న నిర్మాణ పనులను కాలనీ వాసులు ఆదివారం అడ్డగించి నిరసన తెలిపారు. తాము పునాదులు తవ్వుతున్నప్పటి నుంచే అభ్యంతరం తెలుపుతున్నా ఎవ్వరూ పట్టించుకోలేదన్నారు. దీంతో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్తే... దర్యాప్తు చేయాలని అధికారులను ఆదేశించారన్నారు. ప్రజల అభ్యంతరాలు తెలుసుకోవడానికి జీవీఎంసీ అధికారులు వస్తామన్న తరుణంలో సదరు సెల్ సంస్థ పనులు చేయడం సరికాదని కాలనీ వాసులు వాపోయారు. అధికారులు తక్షణమే స్పందించి పనులు పూర్తిగా నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ముఖ్య సలహాదారులు కె.మురళీ కృష్ణ, కృష్ణమోహన్, కోశాధికారులు, కార్యవర్గ సభ్యులు ఎం.వెంకటకృష్ణ, కెప్టెన్ క్రాంతి, రోజా, కె.నిర్మల, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సతీష్‌కు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

తగరపువలస: స్థానిక ఒకటో వార్డు సాయి రవీంద్ర స్కూల్ ప్రిన్సిపాల్ వాంద్రాసి సతీష్‌కు ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. సౌత్ ఇండియా ఐకానిక్ అవార్డులలో భాగంగా భీమిలి నియోజకవర్గ ఉపాధ్యాయులు, అధ్యాపక యూనియన్ అధ్యక్షునిగా ఉన్న సతీష్‌ను ఈ అవార్డు వరించింది. ఆదివారం గుంటూరులో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గిరిబాబు, కలెక్టర్ లక్ష్మీకాంత్ చేతుల మీదుగా అవార్డును తీసుకున్నారు. సతీష్ పలు సంస్థల నుంచి గతంలో అవార్డులు పొందారు.

లక్ష్మీ నారాయణకు అభినందనలు



లక్ష్మీనారాయణను అభినందిస్తున్న కార్పొరేటర్ హనోక్ తదితరులు

మధురవాడ: 11 ఏళ్ల 11 నెలల వయస్సులోనే కరాటేలో 3 నిమిషాల్లో 1000 పంచ్‌లు కొట్టి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం కైవసం చేసుకుని అందరి చేత ఔరా అనిపించుకున్న మధురవాడ రేవళ్లపాలెంకి చెందిన పిళ్లా లక్ష్మీనారాయణను కార్పొరేటర్ కంపా హనోక్ అభినందించారు. వాసుదేవరావు, భార్గవి సంతానమైన లక్ష్మీనారాయణ పీఎంపాలెంలో గల డ్రాగన్ ఫిట్‌నెస్ సెంటర్ నిర్వాహకుడు కనకరాజు శిక్షణలో ఈ రికార్డ్‌ను సాధించాడు. ఆగస్టు 8న నిర్వహించిన ఆన్‌లైన్ పోటీల్లో పాల్గొనగా 18న పోస్టు ద్వారా మెడల్, బుక్, ధ్రువపత్రం అందింది. ఆదివారం రేవళ్లపాలెంలో నిర్వహించిన అభినందన సభలో కార్పొరేటర్ కంపా హనోక్, ఏపీ మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి వై.అప్పారావు అభినందించారు. చిన్నతనంలోనే మంచి విజయాన్ని సాధించిన లక్ష్మీనారాయణ విద్య, సినిమా, కరాటేలో మరింత వృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు, యువత చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. కోచ్ కనకరాజు, సావిత్రమ్మ తదితరులు పాల్గొన్నారు.



బంగారు హారం జారిపడిందని ఫిర్యాదు

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు రామన్నపేటకు చెందిన తమ్మిన రమ అనే మహిళ నుంచి నాలుగు తులాల బంగారు హారం ఈ నెల 6న అదృశ్యమయ్యింది. బంధువుల ఫంక్షన్‌కు వెళ్లేందుకు కుటుంబ సభ్యులతో ఆ రోజు మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై బయలుదేరిన ఆమె జాతీయ రహదారి వద్దకు వెళ్లేసరికి మెడలో హారం కనిపించలేదు. తర్వాత వెనక్కు వచ్చి చూసుకునే సరికి ఆరో తరగతి చదువుతున్న ఒక విద్యార్థి చేతిలో హారం చూసినట్టు స్థానికులు బాధితురాలికి తెలిపారు. దీనికి సంబంధించి ఆమె 7న భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలు మాట్లాడుతూ అదృశ్యమైన హారం తనది కాదని, ఫంక్షన్‌కు వెళ్లే నిమిత్తం తెలిసిన వారిని అడిగి వేసుకున్నట్టు లబోదిబోమంటోంది. ఈ ప్రాంతంలో ఉన్న సీసీ కెమెరాల ద్వారా పరిశీలించి అదృశ్యమైన హారాన్ని గుర్తించాలని పోలీసులను బాధితురాలు కోరుతోంది.

కనక మహాలక్ష్మికి విశేష పూజలు

దాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీ పూజలు ఆదివారం 25వ రోజుకి చేరాయి. ఉదయం 8 గంటలకు వేదమంత్రాలు, నాదస్వరాల నడుమ ప్రారంభమైన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పోస్టు ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు చేసి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. పూజలకు సంబంధించి వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, భక్తులు పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న ఆలయ అధికారులు, భక్తులు



నేరాలకు పాల్పడితే చర్యలు

సీతమ్మధార: ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు సీఐ సింహాద్రినాయుడు కౌన్సెలింగ్ నిర్వహివాంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి నేరాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించా రు. సమాజంలో మద్యం షాపుల వద్ద అల్లర్లు చేయకుండా ఉండాలని, తగాదా ల్లో తలదూర్చకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించా రు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తుంచుకుని మంచిగా జీవించా లని హితవు పలికారు. అనంతరం రౌడీషీటర్ల ను వారి ఇళ్ల వద్ద పోలీస్ సిబ్బంది అప్పగించారు.

